KANCHARLA
మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
ఆదివారం 17 మే 2026


# జూన్ 25 నుంచి ఓటర్ల ప్రత్యేక సర్వే!

- ఇంటింటికీ వెళ్లి పరిశీలించనున్న బీఎల్ఓలు
- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర సీఈఓ సుదర్శన్ రెడ్డి

04



# విశ్వకర్మలను ఒకే కులంగా గుర్తిస్తాం!

- త్వరలోనే కార్పొరేషన్ పాలకమండలి ఏర్పాటు
- ఐదు వృత్తులను ఒకే జనాభాగా ప్రకటిస్తాం
- స్పష్టం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

వివరాలు 4లో..



04

# ధరల పెంపు దారుణం

- సామాన్యుడిపై పిడుగు.. సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం
- ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపడం సరికాదు
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

వివరాలు 3లో..






# నమ్మకమైన బ్యాంక్‌గా 'స్త్రీనిధి' ఎదగాలి

## మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు విముక్తి

- ఇప్పటివరకు 32 లక్షల మందికి రూ. 24 వేల కోట్ల రుణాలు
- హక్కులతో పాటు విధులను ఉద్యోగులు గుర్తుంచుకోవాలి: మంత్రి సీతక్క

వివరాలు 3లో..

# మంత్రి పదవి ఇవ్వండి

- రాహుల్ గాంధీకి పరిగి ఎమ్మెల్యే వినతి!
- తెలంగాణ క్యాబినెట్‌లో అవకాశం కల్పించాలని కోరిక
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం లేదన్న నేత
- మూడు తరాల విధేయతను గుర్తించాలని విన్నపం

02



# పోక్సో కేసులో బండి భగీరథ్ లొంగుబాటు!



## హైకోర్టు బెయిల్ నిరాకరణతో తప్పని పరిస్థితి

## దేశం దాటకుండా లుకౌట్ నోటీసులు జారీ

## మేజిస్ట్రేట్ ఎదుట ముగిసిన బాధితురాలి వాంగ్మూలం

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న మైనర్ బాలిక వేధింపుల కేసులో శనివారం రాత్రి ఊహించని పరిణామం చోటుచేసుకుంది. చుట్టూ ఉచ్చు బిగుస్తుండటం, చట్టపరమైన రక్షణలన్నీ ఒక్కొక్కటిగా చేజారిపోవడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఎట్టకేలకు పేట్ బషీరాబాద్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిర్ద్వంద్వంగా నిరాకరించడం, నిందితుడు దేశం విడిచి పారిపోకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయడంతో లొంగిపోవడం మినహా మరో మార్గం లేని పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలు ఢిల్లీ, కరీంనగర్ లోని నివాసాల్లో ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తూ అరెస్టుకు రంగం సిద్ధం చేసిన తరుణంలో, తన న్యాయవాదుల సలహా మేరకు భగీరథ్ పోలీసుల అదుపులోకి వచ్చారు.

వివరాలు 2లో..

# న్యాయస్థానాలపై నమ్మకముంది!

- కుమారుడి లొంగుబాటుపై బండి సంజయ్ స్పందన
- చట్టం నుంచి తప్పించుకునే ఉద్దేశం లేదు
- ఆధారాల సేకరణ వల్లే కొంత జాప్యం

న్యాయవ్యవస్థపై నమ్మకంతోనే చట్టానికి లోబడి తన కుమారుడు భగీరథ్‌ను పోలీసులకు అప్పగించానని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.



02

# మంత్రి పదవి ఇవ్వండి

## రాహుల్ గాంధీకి పరిగి ఎమ్మెల్యే వినతి!

## తెలంగాణ క్యాబినెట్‌లో అవకాశం కల్పించాలని కోరిక

**న్యూఢిల్లీ, మే 16 (మనసులో మాట):** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్గంలో తనకు అవకాశం కల్పించాలని కోరుతూ ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు.



తెలంగాణ క్యాబినెట్‌లో ప్రస్తుతం మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఎవరికీ ప్రాతినిధ్యం లేదనే విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గతంలో రంగారెడ్డి జిల్లాకు ముగ్గురు నుంచి ఆరుగురు మంత్రులు ఉండేవారని రామ్మోహన్ రెడ్డి గుర్తు చేశారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జిల్లాలో అసెంబ్లీ స్థానాలు 44కు, పార్లమెంట్ స్థానాలు 8కి పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ సమీకరణాల దృష్ట్యా జిల్లాకు మంత్రివర్గంలో చోటు కల్పించాల్సిన అవసరం ఉందని, అందువల్లే తాను మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు.

### మూడు తరాల కాంగ్రెస్ కుటుంబం

తమ కుటుంబం మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతోందని, తాను బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటివరకు నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని, పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా శ్రమించానని వివరించారు. తన వినతిపై రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా రాహుల్ గాంధీతో మాట్లాడి తనకు మంత్రి పదవి దక్కేలా సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మత్తుకు యువత దూరంగా ఉండాలి!

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

## కళాబృందం ద్వారా నేరాలపై అవగాహన

## ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం

**హన్మకొండ, మే 16 (మనసులో మాట):** యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శనివారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వినూత్న అవగాహన కార్యక్రమం జరిగింది. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు, సీసీ కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలపై కళాబృందం సభ్యులు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారంగా మారుతుందని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేశామని, నేరాల నియంత్రణ కోసం ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఏసీపీలు జితేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్ఐలు దేవేందర్, రవి పాల్గొన్నారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్ లొంగుబాటు!

- హైకోర్టు బెయిల్ నిరాకరణతో తప్పని పరిస్థితి
- దేశం దాటకుండా లుకౌట్ నోటీసులు జారీ
- మేజిస్ట్రేట్ ఎదుట ముగిసిన బాధితురాలి వాంగ్మూలం



**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** గతకొన్ని రోజులుగా తీవ్ర సంచలనం సృష్టిస్తోన్న పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించడం, చట్టపరమైన రక్షణ లభించకపోవడంతో ఆయన పోలీసులకు లొంగిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒక మైనర్ బాలికను లైంగికంగా వేధించారనే ఆరోపణలపై బండి భగీరథ్‌పై మే 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే.

### ఐదు బృందాలతో ముమ్మర గాలింపు

ఈ కేసును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న తెలంగాణ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. భగీరథ్ విచారణకు హాజరు కాకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని పరారీలో ఉండటంతో, ఆయన దేశం విడిచి వెళ్లకుండా ఉండేందుకు వీలుగా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. భగీరథ్ కోసం ఢిల్లీ, కరీంనగర్, హైదరాబాద్ నగరాల్లో ఐదు ప్రత్యేక బృందాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో సైబరాబాద్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిందితుడి స్నేహితులు, బంధువుల ఇళ్లపై నిఘా పెట్టారు. అన్ని వైపులా ఉచ్చు బిగుస్తుండటం గమనించిన భగీరథ్, తన న్యాయవాదుల సలహా మేరకు పోలీసుల ఎదుట లొంగిపోయారు.

### మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం నమోదు

ఈ కేసులో మరో కీలక పరిణామంగా మైనర్ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు మేడ్చల్ మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలు, ఆమె తల్లి వాంగ్మూలాలను సుమారు 40 నిమిషాల పాటు రికార్డు చేశారు. ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు రెండుసార్లు నమోదు చేసినప్పటికీ, న్యాయస్థానం ఆదేశాలతో మేజిస్ట్రేట్ ఎదుట మరోసారి రికార్డు చేయడం గమనార్హం. ప్రస్తుతం భగీరథ్ఇక్కడ పోలీసుల అదుపులో ఉన్నారు. ఈ హైడ్రామాకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# న్యాయస్థానాలపై నమ్మకముంది!

## కుమారుడి లొంగుబాటుపై బండి సంజయ్

**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** పోక్సో కేసులో తన కుమారుడు బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోవడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఆ నమ్మకంతోనే కుమారుడిని పోలీసులకు అప్పగించామని స్పష్టం చేశారు. ఈ దేశంలో చట్టానికి ఎవరైనా లోబడాల్సిందేనని, న్యాయంపై ఉన్న గౌరవంతోనే లాయర్ల సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి తాము నిర్దోషులమని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సేకరించే క్రమంలోనే పోలీసుల ముందుకు రావడంలో కొంత జాప్యం జరిగిందని వివరించారు. అంతేకానీ చట్టం నుండి తప్పించుకోవాలనే ఆలోచన తమకు లేదన్నారు. ఇప్పటివరకు లొంగిపోకుండా సరైన ఆధారాలతో లాయర్ల ద్వారా పోలీసుల ముందుకు వచ్చామని తెలిపారు. కుమారుడిని చట్టం ముందు ప్రవేశపెట్టినందున, ఇకపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు. న్యాయస్థానాల్లో తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ లొంగుబాటుతో గత కొన్ని రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడగా, పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.



# 18 నుంచి క్రీడా, పర్యాటక వారోత్సవాలు!

- కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం

**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు నిర్వహించే యువజన, క్రీడ, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుంచి 23 వరకు నిర్వహించే వివిధ కార్యక్రమాలపై స్పెషల్ సీఎస్‌లు జయేష్ రంజన్, వాణీ ప్రసాద్‌లతో కలిసి శనివారం డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

### యువతలో చైతన్యం కోసమే..

యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు సీఎస్ తెలిపారు. పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, పర్యాటక స్థలాలను ప్రజలు సందర్శించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. క్రీడా వేడుకలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

### 'ఫిట్ తెలంగాణ' 5 కే రన్

ఈ నెల 18న నిర్వహించే 'ఫిట్ తెలంగాణ' థీమ్‌తో రాష్ట్ర, జిల్లా కేంద్రాలలో 5 కే రన్ నిర్వహించాలన్నారు. అన్ని మండల కేంద్రాలలో వాకథాన్, యోగా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తెలంగాణ పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయన్నారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

### ధాన్యపు కొనుగోళ్లపై సమీక్ష

జిల్లాల్లో కొనసాగుతున్న ధాన్యపు కొనుగోళ్లపై కూడా జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ధాన్యపు కొనుగోళ్లలో ఎక్కడా జాప్యం జరగొద్దన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

# బోరుబావి గుంతలో పడ్డ మనవడు

- రక్షించబోయి తాత మృతి!
- మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లిలో విషాదం
- మనవడిని కాపాడి కన్నుమూసిన వృద్ధుడు
- సురక్షితంగా బయటపడ్డ నాలుగేళ్ల బాలుడు



**మిర్యాలగూడ, మే 16 (మనసులో మాట):** మిర్యాలగూడ రూరల్ మండలం యాదగిరిపల్లి గ్రామ శివారులో శనివారం ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు బోరుబావి పక్కన ఉన్న గుంతలో పడిపోయిన నాలుగేళ్ల మనవడిని కాపాడే క్రమంలో తాత ప్రాణాలు కోల్పోయాడు. యాదగిరిపల్లి గ్రామ శివారులోని ఒక వ్యవసాయ బోరుబావి పక్కన సుమారు 12 అడుగుల లోతు గల గుంత ఏర్పడింది. శనివారం ఉదయం గ్రామానికి చెందిన వెంకన్న తన కూతురు పిల్లలైన హేమాంష్, లోహితలను తీసుకుని పొలానికి వెళ్లాడు. పొలంలో పనులు జరుగుతుండగా, మనవడు హేమాంష్ ఆడుకుంటూ వెళ్లి బోరుబావి పక్కనే ఉన్న ఆ గుంతలో పడిపోయాడు.

### తలకిందులుగా ఇరుక్కుపోయిన తాత

బాలుడు గుంతలో పడటాన్ని గమనించిన వెంకన్న చిన్నారిని పైకి తీసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి, తలకిందులుగా ఆ గుంతలోనే ఇరుక్కుపోయాడు. పైకి లేచేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో పక్కనే ఉన్న మనవరాలు లోహిత భయపడి సమీపంలోని రైతులకు సమాచారం అందించింది. వారు వెంటనే అక్కడికి చేరుకుని రూరల్ ఎస్ఐకి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఒక యువకుడి సహాయంతో ఇద్దరినీ గుంత నుంచి బయటకు తీయించారు.

### ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి

గుంత నుంచి బయటకు తీసిన అనంతరం వైద్య పరీక్షల కోసం వారిని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. అయితే గుంతలో తలకిందులుగా ఇరుక్కుపోవడంతో తీవ్ర ఊపిరాడక వెంకన్న మార్గమధ్యంలోనే కన్నుమూశాడు. బాలుడు హేమాంష్ ఎలాంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా బయటపడ్డాడు. మనవడిని కాపాడి తాత ప్రాణాలు కోల్పోవడంతో మృతుడి కుటుంబంలో తీవ్ర విషాద చాయలు అలముకున్నాయి.

# మ్యాచ్ టికెట్ల పేరిట నకిలీ యాప్‌లు!

### ఫేక్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త అన్న సీపీ సజ్జనార్

### అధికారిక డిస్ట్రిక్ట్ యాప్‌ను పోలిన లోగోలతో మోసాలు

### అనధికారిక లింకులను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** మే 22న ఉప్పల్ వేదికగా జరగనున్న ఎస్ఆర్‌హెచ్, ఆర్‌సీబీ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుంటున్నట్లు సీపీ సజ్జనార్ హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా ఐపీఎల్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి అనేక ప్రకటనలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన డిస్ట్రిక్ట్ యాప్‌ను పోలిన రంగులు, లోగోలతో ఉన్న నకిలీ యాప్‌లను సృష్టించి, తక్కువ ధరకే టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారని పేర్కొన్నారు. ఫేక్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక లింకులను నమ్మి మోసపోవద్దని సజ్జనార్ సూచించారు. ఇలాంటి ఫేక్ యాప్స్, వెబ్‌సైట్లపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. ఎవరికైనా ఇలాంటి యాప్స్, వెబ్‌సైట్ల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు.



# ధరల పెంపు దారుణం

### సామాన్యుడిపై పిడుగు.. సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం

### ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపడం సరికాదు

### పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏమాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుదేలైందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆత్మనిర్భర్ అనేది కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప, ఫలితాలు తెచ్చే విధానం కాదని ఈ నిర్ణయంతో తేలిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని, యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగానే మిగిలిపోయిందని దుయ్యబట్టారు. గత పదేళ్లుగా రూపాయి విలువ నిరంతరం పతనమవుతూ వస్తోందని, ఇప్పుడు ఆ పతనం పరాకాష్టకు చేరిందని పేర్కొన్నారు.



### ఎన్నికలు కాగానే నమ్మకద్రోహం

ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ – ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపి ఇంధన ధరలను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం, ఈ ధరల పెంపును ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచబోమని కేంద్రం పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే లీటరుకు మూడు రూపాయలకు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమేనని మండిపడ్డారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసమే మోదీ అబద్ధాలు చెబుతారనే విషయం దీనివల్ల స్పష్టమైందని, ఇది ముమ్మాటికీ విశ్వాసఘాతుకమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# నమ్మకమైన బ్యాంక్‌గా 'స్త్రీనిధి' ఎదగాలి!

### మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు విముక్తి

### ఇప్పటివరకు 32 లక్షల మందికి రూ. 24 వేల కోట్ల రుణాలు

### హక్కులతో పాటు విధులను ఉద్యోగులు గుర్తుంచుకోవాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** ఉద్యోగులు తమ హక్కులతో పాటు విధులను కూడా గుర్తుంచుకోవాలని రాష్ట్ర మంత్రి సీతక్క సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతో తోడ్పడుతున్న స్త్రీనిధి సంస్థను అందరూ కలిసి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గతంలో మహిళలు ఎదుర్కొన్న మైక్రో ఫైనాన్స్ వేధింపుల నుంచి విముక్తి కల్పించేందుకే స్త్రీనిధి ఏర్పాటయిందని వివరించారు. స్త్రీనిధి సంస్థ ద్వారా ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 32 లక్షల మంది మహిళలకు రూ. 24 వేల కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు చెందిన ఈ విజయవంతమైన స్త్రీనిధి మోడల్‌ను ప్రస్తుతం ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని గర్వంగా ప్రకటించారు. మహిళల అభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధి రంగాలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఆదివాసీ మహిళల ఉత్పత్తులకు సైతం మంచి మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. స్త్రీనిధి సంస్థపై కొందరు పనిగట్టుకుని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వాటిని వెంటనే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాల వల్ల సంస్థ ప్రతిష్టకు భంగం కలగకూడదన్నారు. స్త్రీనిధి అనేది పూర్తిగా మహిళల కోసం, మహిళల ఆధ్వర్యంలోనే నడిచే అద్భుతమైన సంస్థ అని కొనియాడారు. ఈ సంస్థ ఏర్పాటులో, దీని విజయవంతమైన ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన విద్యాసాగర్ రెడ్డిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.




# రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయాలి!

### సభ్యత్వాలను విస్తృతంగా పెంచాలని కలెక్టర్ ఆదేశం



**ఆసిఫాబాద్, మే 16 (మనసులో మాట):** జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాలను విస్తృతంగా పెంచి, సంస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ కే హరిత అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు, బలోపేతంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందడం ద్వారా రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సొసైటీలో చేరడానికి ఉన్న వివిధ రకాల సభ్యత్వ రుసుములను కలెక్టర్ వివరించారు. పాట్రాన్ సభ్యత్వానికి రూ. 25 వేలు, వైస్ పాట్రాన్ సభ్యత్వానికి రూ. 12,500, జీవితకాల సభ్యత్వానికి రూ. 1,000, వార్షిక సభ్యత్వానికి రూ. 100 చెల్లించి సభ్యత్వం పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పాటు బార్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులను రెడ్ క్రాస్ లో చేర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# జూన్ 25 నుంచి ఓటర్ల ప్రత్యేక సర్వే!

**ఇంటింటికీ వెళ్లి పరిశీలించనున్న బీఎల్ఓలు**

**అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల**

**వివరాలు వెల్లడించిన రాష్ట్ర సీఈఓ సుదర్శన్ రెడ్డి**



**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభమైందని, తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బీఎల్ఓలు ప్రత్యేక సర్వే నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని, ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్ఓలు సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం-6 లో ప్రత్యేకంగా నమోదు చేస్తారని వివరించారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యూమరేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ నంబర్ 1950తో పాటు 'కాల్ యువర్ బీఎల్ఓ' సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు. ఎన్యూమరేషన్ దశలో నిర్ణీత ఫారం తప్ప ఎలాంటి అదనపు పత్రాలు అవసరం లేదని స్పష్టం చేశారు.

### వయస్సు ఆధారంగా నిబంధనలు

ఫారం సమర్పించిన వారందరి పేర్లను డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేరుస్తారని, ఫారం ఇవ్వని వారి జాబితాను పోలింగ్ బూత్ వారీగా ప్రదర్శిస్తారని సీఈఓ తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ విడుదల తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు కొన్ని నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1 కంటే ముందు పుట్టిన వారికి ఒకే ఒక పత్రం సరిపోతుందని, 1987 నుంచి 2004 మధ్య జన్మించిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని స్పష్టం చేశారు. 2004 తర్వాత పుట్టిన వారికి తల్లిదండ్రుల ధ్రువీకరణ పత్రాలు ఖచ్చితంగా కావాలన్నారు. గతంలో 2002లో రాష్ట్రంలో ఇలాంటి సర్వే నిర్వహించారని గుర్తు చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనేదే ఈ ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు.

### అక్టోబర్ 1న తుది జాబితా

ప్రస్తుతం రాష్ట్రంలో 3.45 కోట్ల మంది ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని సీఈఓ వెల్లడించారు. ఈ ప్రక్రియపై త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యూమరేషన్ పూర్తయిన తర్వాత డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేస్తామని, అందులో చూసుకుని ఓటర్లు తమ పేర్ల మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని వివరించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే జరుగుతుందని, జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేస్తామని ప్రకటించారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, అనంతరం అన్నింటినీ పరిశీలించి అక్టోబర్ 1వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# విశ్వకర్మలను ఒకే కులంగా గుర్తిస్తాం!

- త్వరలోనే కార్పొరేషన్ పాలకమండలి ఏర్పాటు
- ఐదు వృత్తులను ఒకే జనాభాగా ప్రకటిస్తాం
- స్పష్టం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్




**ఎల్బీనగర్, మే 16 (మనసులో మాట):** పంచ వృత్తుల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కుల జనాభాగా ప్రకటించి, పాలక మండలిని వెంటనే ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ సలహాదారులు వీహెచ్ హన్మంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, కమిటీ సభ్యులను జేఏసీ నాయకులు కలిశారు. రాష్ట్ర విశ్వకర్మ జేఏసీ కమిటీ చైర్మన్ రాయబండి పాండురంగాచారి, వైస్ చైర్మన్ నందిపేట రవీందర్ ఆధ్వర్యంలో విశ్వకర్మలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘాలన్నీ కలిసి ఉమ్మడి వేదికగా ఏర్పడటం శుభపరిణామమని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

### ఒకే కులంగా గెజిట్ ఇవ్వాలి

రాష్ట్రంలో చేపట్టిన కులగణనలో విశ్వకర్మలను ఒకే జనాభా కింద ప్రకటించకుండా, వృత్తుల వారీగా విడివిడిగా చూపడం వల్ల జనాభా సంఖ్య తక్కువగా కనిపిస్తోందని జేఏసీ నాయకులు మంత్రికి వివరించారు. అందువల్ల పంచ వృత్తుల వారందరినీ ఒకే కులంగా, ఒకే జనాభాగా గుర్తిస్తూ వెంటనే గెజిట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 18 కులాల కార్పొరేషన్ల తరహాలోనే, విశ్వకర్మలకు కూడా వెంటనే కార్పొరేషన్ పాలకమండలిని ప్రకటించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఒకే జనాభాతో పాటు కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

శ్వకర్మల ఉమ్మడి ప్రయోజనాల కోసం రాష్ట్రంలో ఉన్న వివిధ సంఘాల సోదరులంతా కలిసి నడవాలని జేఏసీ చైర్మన్ రాయబండి పాండురంగాచారి, నందిపేట రవీందర్ పిలుపునిచ్చారు. మనలో ఉన్న అనైక్యత వల్ల దశాబ్దాలుగా నష్టపోయామని, జనాభా దామాషా ప్రకారం మన వాటా సాధించుకోవడానికి కలిసికట్టుగా పోరాడాలని కోరారు. కమ్మర, వడ్రంగ, కంచర, శిల్పికార, అవసల వృత్తులను విడివిడిగా చూడకుండా ఒకే తాటిపైకి రావాలన్నారు. వ్యక్తిగత భేదాలను పక్కన పెట్టి, జాతి ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ జేఏసీ నాయకులు మోత్కూరి మల్లాచారి, మారోజు సునీల్ కుమార్, జయకరణ్ చారి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# ధాన్యాల కొనుగోలులో ప్రభుత్వం వైఫల్యం!

**రైతుల సమస్యలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం**

**మక్కలు, వరి సకాలంలో తరలించట్లేదు**

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధ్వజం**

**నిజామాబాద్, మే 16 (మనసులో మాట):** ధాన్యం కొనుగోళ్లు, వాటి తరలింపులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షలు నిర్వహించినా క్షేత్రస్థాయిలో పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని ఆరోపించారు.



మక్కలు, వరి ధాన్యం కొనుగోలు చేసినప్పటికీ సకాలంలో మిల్లులకు తరలించకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల ముందు ప్రతి వర్గానికి ఆకర్షణీయమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. జొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వ పెద్దలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ పాలనపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

ఎన్నికల సమయంలో రైతు భరోసా పేరుతో ఏడాదికి రూ. 15 వేల సాయం, కౌలు రైతులకు ఆర్థిక భరోసా, వరికి బోనస్, ప్రతి పంటకు మద్దతు ధర, రైతుబీమా కొనసాగింపు, వృద్ధులకు పింఛన్ల పెంపు, మహిళలకు భరోసా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అంటూ అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ నేడు రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలను సైతం సరిగ్గా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వృద్ధులకు భరోసా అందడం లేదని, యువతకు ఉద్యోగ అవకాశాలు కనిపించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించారు.

# పెట్రో ధరల పెంపుపై సీపీఐ నిరసన!

**తాడుతో ఆటో లాగి వినూత్న నిరసన**

**మోదీ పాలనలో అన్ని రంగాల్లో విఫలం**

**ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్**

**కోటగిరి, మే 16 (మనసులో మాట):** పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దారుణమని, వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, కోటగిరి మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పెంచిన ఇంధన ధరలకు నిరసనగా శనివారం ట్రాలీ ఆటోకు తాడు కట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంచిన ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు, సామాన్యులు, చిరు ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సామాన్యుల నడ్డి విరిచేలా ధరలు పెంచారని మండిపడ్డారు.

### ధరల నియంత్రణలో మోదీ ప్రభుత్వం విఫలం

ధరల నియంత్రణలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ నాయకులు విమర్శించారు. ఒకవైపు ధరలు పెంచుతూ, మరోవైపు పొదుపు మంత్రం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియడంతోనే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో అన్ని రంగాల్లో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో రూ. 300 ఉన్న వంట గ్యాస్ ధర బీజేపీ హయాంలో రూ. 1000 కి పైగా చేరిందని, అయినా ప్రజలకు సకాలంలో గ్యాస్ దొరికే పరిస్థితి లేదని మండిపడ్డారు. చిరు వ్యాపారులకు కమర్షియల్ గ్యాస్ దొరకక హోటళ్లు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు.

### జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్

దేశంలో కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు పెంచి, సామాన్య ప్రజలపై ప్రత్యక్ష భారాలు మోపడం సరికానిదని సీపీఐ నేతలు పేర్కొన్నారు. బీజేపీ హయాంలోనే పెట్రోల్, డీజిల్, గ్యాస్ పై జీఎస్టీ తెచ్చారని, వాటిపై జీఎస్టీని ఎత్తివేస్తే ధరలు తగ్గుతాయని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పెంచిన ధరలను తగ్గించకుంటే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నల్ల గంగాధర్, నీలి శంకర్, రాజు, రాములు, హనుమంట్లు, అన్సార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్ల అరెస్ట్!

- వృద్ధురాలి మెడలో గొలుసు లాకెళ్లిన కేటుగాళ్లు
- సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల గుర్తింపు
- బైక్, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు



**నల్లగొండ, మే 16 (మనసులో మాట):** తిప్పర్తి మండలం ఎర్రగడ్డ గూడెంలో వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఇద్దరు చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కే. శివరాం రెడ్డి తెలిపారు. ఈ నెల 11వ తేదీన గ్రామానికి చెందిన చింతమల్ల సత్యమ్మ (70) మర్రిచెట్టు కింద కూర్చుని ఉండగా, ఆమె ఒంటరిగా ఉందని గమనించిన బాణాలు హరిచంద్ర ప్రసాద్, అతని మిత్రుడైన ఓ మైనర్ బాలుడు ఆమె మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల గుర్తింపు

డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో తిప్పర్తి ఎస్ఐ శంకర్ బృందం, సీసీఎస్ బృందం ప్రత్యేకంగా ఏర్పడి నిఘా పెట్టాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఇద్దరు నిందితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

### మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ఈ సందర్భంగా డీఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు. మహిళలు బయట ఒంటరిగా ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ఎండాకాలంలో ఆరుబయట నగలు ధరించి నిద్రించవద్దని సూచించారు. ఇంట్లో బంగారం నిల్వ చేయకుండా బ్యాంకులు లేదా భద్రమైన లాకర్లలో భద్రపరచాలని కోరారు. గ్రామాల్లో నేరాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ శంకర్, హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్ గిరి, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, వహిద్ షా, శ్రీనివాస్ రెడ్డి, కానిస్టేబుళ్లు నరేష్, శివరాజ్, సాయి, దస్తగిరి, రాం రెడ్డి తదితర పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ!

### కర్రలు, కత్తులతో దాడులు.. పలువురికి గాయాలు

### రాయపర్తి మండలం మర్రి తండాలో ఉద్రిక్తత

### క్షతగాత్రులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలింపు

**వరంగల్, మే 16 (మనసులో మాట):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండా పరిధిలోని మర్రి తండాలో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్య మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇరువర్గాలు కర్రలు, కత్తులతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఈ దాడిలో రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్యతో పాటు కిరణ్, రాజేందర్, నవీన్, జీవన్ సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘర్షణపై సమాచారం అందుకున్న రాయపర్తి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. గొడవ పడుతున్న ఇరువర్గాలను చెల్లాచేదురు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘర్షణకు గల పూర్తి కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఫామ్‌హౌస్‌లో ఇద్దరు మహిళల హత్య!

### తాండూరులో అదృశ్యమైన బాధితులుగా గుర్తింపు

**రంగారెడ్డి, మే 16 (మనసులో మాట):** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని ఒక ఫామ్‌హౌస్‌లో ఇద్దరు వృద్ధ మహిళల దారుణ హత్య వెలుగుచూసింది. గుర్తుతెలియని వ్యక్తులు వీరిని అత్యంత కిరాతకంగా హతమార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మృతులను తాండూరు ప్రాంతంలో అదృశ్యమైన ఇద్దరు వృద్ధులుగా గుర్తించారు. హతుల వయసు దాదాపు 60 సంవత్సరాలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. బాధితులను వికారాబాద్ నుంచి ఇక్కడికి తీసుకువచ్చి ఫామ్‌హౌస్‌లో హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఫైనాన్స్ డబ్బుల వ్యవహారంలోనే ఈ ఘోరం జరిగినట్లు భావిస్తున్నారు. డబ్బులు ఇస్తామని నమ్మబలికి ఇక్కడికి పిలిపించి, అత్యంత దారుణంగా హతమార్చినట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# జవహర్‌నగర్ చోరీ కేసు ఛేదన

### వృద్ధ దంపతులను కట్టేసిన నేపాలీ ముఠా అరెస్ట్

### 250 సీసీటీవీల పరిశీలనతో దొరికిన క్లూస్

### నిందితుల నుంచి బంగారం, నగదు స్వాధీనం

**జవహర్‌నగర్, మే 16 (మనసులో మాట):** సికింద్రాబాద్ పరిధిలోని జవహర్‌నగర్‌లో జరిగిన సంచలన చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. వృద్ధ దంపతులను బంధించి ఇంట్లో దోపిడీకి పాల్పడిన నేపాలీ ముఠాలోని కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 12న జరిగిన ఈ ఘటనలో నేపాలీ దంపతులు మమత, రమేష్‌లతో పాటు సబీనా అనే మరో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి భారీగా బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీలో మొత్తం ఎనిమిది మంది నేపాలీ ముఠా సభ్యులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. మల్కాజ్‌గిరి డీసీపీ సుమతి ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ భారీ చోరీ కేసును పోలీసులు కేవలం 72 గంటల్లోనే ఛేదించారు. ఘటనా స్థలం పరిసరాల్లోని 250కి పైగా సీసీటీవీ ఫుటేజీలను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా విశ్లేషించాయి. అందులో లభించిన పక్కా ఆధారాల సహాయంతో నిందితులను పట్టుకున్నారు. పక్కా ప్రణాళికతో ఇంట్లోకి ప్రవేశించి దారుణానికి తెగబడిన ఈ ముఠాలోని నలుగురిని ప్రస్తుతానికి అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న మిగతా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని డీసీపీ తెలిపారు.

### పుట్టినరోజు వేడుకల పేరిట నమ్మించి దారుణం

జవహర్‌నగర్‌లోని కౌకూర్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ (68), భార్య డాక్టర్ విజయలక్ష్మి (58) నివాసం ఉంటున్నారు. వారి ఇంట్లో నమ్మకంగా పనికి కుదిరిన మీనా అలియాస్ మమత.. తన పుట్టినరోజు వేడుకల కోసమంటూ మిగతా ముఠా సభ్యులను అక్కడికి రప్పించింది. వేడుకల నెపంతో యజమానులను నమ్మించిన రమేష్, మమత.. అర్ధరాత్రి దాటాక వృద్ధ దంపతులను గట్టిగా కట్టేసి లూటీకి పాల్పడ్డారు. ఇంట్లోని దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండి, రూ. 30 వేల నగదు, 3 వేల విదేశీ డాలర్లతో ఈ ముఠా పరారైంది. ఇలాంటి ఘోరాలు జరగకుండా ఉండాలంటే ఇంటి యజమానులు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సుమతి సూచించారు. ఇళ్లలో పనిమనుషులు, జీతగాళ్లను పెట్టుకునేటప్పుడు వారి పూర్తి వివరాలను పోలీసులు రూపొందించిన ప్రత్యేక యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కోరారు.

# ధాన్యపు దిగుమతుల్లో అలసత్వం వీడాలి!

### రైస్ మిల్లర్లకు కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరిక

### నిబంధనలు ఉల్లంఘించిన రెండు మిల్లులు బ్లాక్‌లిస్ట్

### రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు



**మెదక్, మే 16 (మనసులో మాట):** ధాన్యం దిగుమతుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. రబీ మార్కెటింగ్ సీజన్ 2025-26లో భాగంగా కేంద్రాల (పీపీసీల) నుంచి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని పలుమార్లు స్పష్టం చేసినా కొందరు మిల్లర్లు పెడచెవిన పెట్టడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా ధాన్యం దిగుమతుల్లో తీవ్ర అలసత్వం ప్రదర్శించిన రెండు మిల్లులపై కలెక్టర్ తక్షణమే వేటు వేశారు. పాపన్నపేట మండలంలోని మేసర్స్ శ్రీ సాయి లక్ష్మీ ట్రేడర్స్, రామాయంపేటలోని మేసర్స్ భవాని ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను తక్షణ ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు కలెక్టర్ ప్రకటించారు. మిల్లర్ల నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన మిల్లులకు ఎటువంటి ధాన్యం కేటాయింపులు ఉండవని స్పష్టం చేశారు. జిల్లాలోని మిగతా రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వ నిబంధనలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# యువతిపై ప్రేమోన్మాది కత్తితో దాడి!

**జడ్చర్ల, మే 16 (మనసులో మాట):** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో తీవ్ర కలకలం రేపిన ఘోర ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న యువతిపై ఒక ప్రేమోన్మాది కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన యువతిని స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఒక ఉన్మాది క్రూరత్వానికి అమాయక యువతి బలికావడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాధిత యువతి జడ్చర్లలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. నిందితుడు గత కొంతకాలంగా ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు సమాచారం. తన ప్రేమను సదరు యువతి నిరాకరించిందనే అక్కసుతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే శనివారం ఆమె బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో అదను చూసి కత్తితో దాడికి ఒడిగట్టాడు. యువతిపై దాడి జరుగుతున్న సమయంలో గమనించిన చుట్టుపక్కల ప్రజలు వెంటనే అప్రమత్తమయ్యారు.

# నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఎండలు!

**ఈ నెల 26న కేరళను తాకనున్న రుతుపవనాలు**

**తెలంగాణలో మాత్రం తగ్గని ఎండల తీవ్రత**

**కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలకు అవకాశం**



**హైదరాబాద్, మే 16 (మనసులో మాట):** ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడ నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల వరకు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి!

**కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం**



**కరీంనగర్, మే 16 (మనసులో మాట):** కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి దశను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని, ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణను బలోపేతం చేయాలని సూచించారు. మ్యాపింగ్‌లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి పనులు ముందుకు తీసుకెళ్లాలన్నారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సిద్ధం చేయాలి**

పద్మనగర్, ఆరేపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇండ్లకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు లక్ష్మీ నరసింహారావు, నరేందర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# కమిటీ ఏర్పాటు ఉద్యమకారుల విజయం!

- ప్రజాభవన్ ముట్టడితోనే కార్యరూపం దాల్చిన పోరాటం
- జీవో విడుదలపై సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- టీయూఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్



**ఎల్బీనగర్, మే 16 (మనసులో మాట):** తొమ్మిది సంవత్సరాలుగా అనేక రూపాల్లో వినతుల ద్వారా మొదలైన ఉద్యమం ప్రజాభవన్ ముట్టడితో ఒక కార్యరూపం దాల్చిందని, ఈ విజయాన్ని తెలంగాణ ఉద్యమకారులకు అంకితం ఇస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ (టీయూఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జోర్క రామ్ ముదిరాజ్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ సర్కిల్‌లో అమరవీరుడు శ్రీకాంత్ చారి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

**ఉద్యమకారుల ఆత్మగౌరవ విజయం**

ఈ సందర్భంగా జెనిగె విష్ణువర్ధన్ మాట్లాడుతూ చివరి ఉద్యమకారుడి వరకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం వేసిన కమిటీ కట్టుబడి ఉండాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయంతో ఒక అడుగు ముందుకు పడినట్టుగా భావిస్తున్నామన్నారు. ఇది తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని తెలుపుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ప్రజాభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ బృందానికి సమయం ఇచ్చి ఉన్నతాధికారులతో చర్చలు జరిపించడంలో ఆలస్యం లేకుండా, కాలయాపన లేకుండా జీవో విడుదల చేయడానికి సహకరించిన చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఉద్యమకారులందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రత్యేక సహకారం ముసర గారి రాజు గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆదాల యాదయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు తాండ ఉపేంద్ర యాదవ్, జిల్లా ప్రచార కార్యదర్శి కిషోర్ లాల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాము సాగర్, అబ్దుల్లాపూర్మెట్ మండల ఇంచార్జి చిత్రం కృష్ణ, లక్ష్మణ్, ఆర్ రజిని, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం!

- వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి
- జీవో 29, జీవో 46లను రద్దు చేయాలని డిమాండ్
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ధ్వజం



**ఎల్బీనగర్, మే 16 (మనసులో మాట):** ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగుల ఆత్మహత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత స్వయంగా ఏర్పాటు చేసుకున్న "ఆస్పరెంట్ అడ్డా- టీ పాయింట్" వద్ద ఆయన నిరుద్యోగులతో కలిసి టీ తాగుతూ సమావేశం నిర్వహించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ హైదరాబాద్ లోని అశోక్‌నగర్ ప్రాంతంలో నిరుద్యోగ యువతను కలిసి ఇచ్చిన ఖాళీల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలను ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచి వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని దుయ్యబట్టారు.

**యూత్ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి?**




ప్రియాంక గాంధీ వాద్రా ప్రకటించిన "యూత్ డిక్లరేషన్" లో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, ఐదు లక్షల రూపాయల విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సకాలంలో విడుదల వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు మరిచారని ఎద్దేవా చేశారు. ఈ హామీలను నమ్మి యువత కాంగ్రెస్ పార్టీని గెలిపించిందని, కానీ ఇప్పుడు ఆ హామీలన్నీ నీటి మూటలయ్యాయని విమర్శించారు. ఉద్యోగాల ఊసే లేకుండా నిరుద్యోగ యువతను ప్రభుత్వం నిరాశలోకి నెట్టిందని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీపై స్పష్టత లేకపోవడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు.

**జీవోలు రద్దు చేయకుంటే పోరాటం**

జీవో 29, జీవో 46లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. గ్రూప్-1 నియామకాల్లో చోటుచేసుకున్న అనుమానాలపై ఎస్ఐటీ విచారణ చేపట్టి పారదర్శకత నిరూపించుకోవాలని కోరారు. లేని పక్షంలో భారాస తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారాస నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, నిరుద్యోగ జేఏసీ నాయకులు ఇంద్రనాయక్, శంకర్, శింబు నాయక్, భూక్యాకుమార్, నవీన్ పట్నాయక్, సింధురెడ్డి, ఆకాష్, అంజలి, శ్రీదేవి, అశోక్, నందు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం తప్పదు!

- ఇంధన, నిత్యావసరాల ధరల పెంపుపై సీపీఐ ధర్నా
- పెద్ద అంబర్‌పేట్‌లో కమ్యూనిస్టుల భారీ ర్యాలీ
- కార్పొరేట్ల మెప్పు కోసమే ప్రధాని భజన: సీపీఐ నేతలు




**రంగారెడ్డి, మే 16 (మనసులో మాట):** ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ప్రజలపై భారం పడుతుందని భావించినట్లుగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ అధ్యక్షతన పెద్ద అంబర్‌పేట్ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీల మెప్పు పొందడానికే పని చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు రాగానే ధరలు పెంచి సామాన్య ప్రజలను మోసం చేశారని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోడీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెంపు వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, బీకేఎస్ జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి, సైదులు ముదిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మధు, ఆవుల యాదగిరి, మంగళపల్లి రవి, పానుగంటి సాయిలు, దవుల రాములు, పావిరాల అశోక్, అనిల్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేష్ నాయక్, మండల కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ!

**జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన**

**'ఫ్రైడే - డ్రైడే' పాటించాలని అధికారుల పిలుపు**

**జ్వరం వస్తే వెంటనే రక్త పరీక్షలు తప్పనిసరి**



**ఆదిలాబాద్, మే 16 (మనసులో మాట):** పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ముఖ్యంగా డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చని తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ రజనీరాణి సూచించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తాండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. "ఒక్క దోమ అనేక ప్రమాదాలు" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈడిస్ ఈజిప్ట్ దోమ వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని వారు వివరించారు. ఇంటి లోపల ఉండే పూల కుండీలు, కూలర్లు, మంచి నీటి తొట్లు, కొబ్బరి బోండాలు, నిల్వ ఉన్న మంచి నీటి పరిసరాలలో ఈ దోమలు స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటాయన్నారు. జబ్బు బారిన పడిన వ్యక్తి నుంచి వైరస్‌ను మోసుకొచ్చి ఇతరులను కుట్టడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారంలో ఒకరోజు 'ఫ్రైడే-డ్రైడే' పాటించాలని పిలుపునిచ్చారు. సమాజ భాగస్వామ్యంతోనే డెంగ్యూను పూర్తిగా నివారించవచ్చని అన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు నిర్వహించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**కలెక్టర్ సీహెచ్ ప్రియాంక!**

**నారాయణపేట, మే 16 (మనసులో మాట):** నారాయణపేట జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలను వేగవంతం చేసి, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో వివిధ నిధులతో సాగుతున్న ఇంజనీరింగ్ పనులపై శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్లో ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

**మెడికల్ కాలేజీ పనులపై నిలదీత**

మెడికల్ కళాశాల, ఎంసీహెచ్, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనుల ప్రగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల వద్ద కనీసం ఒక్క బోరు కూడా వేయకుండా నిర్మాణ పనులకు క్యూరింగ్ ఎలా చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. సమీపంలోని రైతు ప్రైవేటు బోరు నీటిని వాడుతున్నామని అధికారులు చెప్పగా, ప్రభుత్వ భవన నిర్మాణాలు ఎక్కడ జరిగినా ముఖ్యంగా మెడికల్ కాలేజీ వద్ద తప్పకుండా వాన నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు నిర్మించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఆసుపత్రిలో జనరేటర్ ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతులు, పీఎం శ్రీ స్కూళ్లలో సైన్స్ ల్యాబ్ ల నిర్మాణాలను పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 2023-24, 2024-25 సంవత్సరాల నాటి పెండింగ్ పనులన్నీ పూర్తి కావాలన్నారు. మక్తల్ లోని వంద పడకల ఆసుపత్రి అకాడమిక్ బ్లాక్ పూర్తయిందని అధికారులు తెలపగా, మిగతా పనుల్లో వేగం పెంచాలన్నారు. మక్తల్ జూనియర్ కళాశాల అదనపు గదులు, మద్దూరు ఎస్సీ బాలుర వసతి గృహ మరమ్మతులను వేసవి సెలవులు ముగిసేలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**జూన్ 2 లోపు ప్రారంభానికి ఏర్పాట్లు**

వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం పక్కన పూర్తయిన సమీకృత చేనేత భవనాన్ని, అలాగే జిల్లా మహిళా సమాఖ్య భవనాన్ని జూన్ 2 లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. జిల్లా కేంద్రంలోని మూడు ఓవర్ హెడ్ 10 లక్షల లీటర్ల ట్యాంకుల నిర్మాణాలను ఆగస్టు కల్లా పూర్తి చేయాలన్నారు. సంగంబండ రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈలు శ్రీనివాసరావు, రంగారావు తెలపగా, మన్యంకొండ నుంచి రోజుకు ఎన్ని లీటర్ల నీరు అందుతుందో పూర్తి జాబితా ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. గుండుమాల్, కొత్తపల్లి మండలాల సమీకృత భవనాల పనులను వేగవంతం చేయాలన్నారు.

# ధరల పెంపుపై సీపీఐ నిరసన!

**హయత్‌నగర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం**

**ధరలు తగ్గించకుంటే ఆందోళనలు ఉధృతం: శేఖర్ రెడ్డి**



**ఎల్బీనగర్, మే 16 (మనసులో మాట):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పెంచుతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి కర్నే సుజాత అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసరాల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి దాపురించిందని సామిడి శేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అందుబాటులో ఉన్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇంధన ధరలను తగ్గించకుండా ప్రజలను దోచుకుంటోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వల్ల రవాణా ఛార్జీలు పెరిగి ఉప్పు, పప్పుల దగ్గరి నుంచి అన్ని రకాల సరుకుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ పెంచిన ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించకపోతే, భవిష్యత్తులో సీపీఐ, అన్ని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని కేంద్రాన్ని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో లెక్చరర్స్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షులు చెంది వెంకట్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మండల కార్యదర్శి కొప్పుల సరిత, ఏఐటీయూసీ మండల కార్యదర్శి పట్టేటి శేఖర్, అధ్యక్షుడు గోల్కొండ నాగరాజు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఇసంపల్లి వెంకట్, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్, మండల బీకేఎస్ నాయకులు బొడ్డు శ్రీను, సామ్యూల్, వివిధ శాఖల కార్యదర్శులు సౌజన్య, శివజ్యోతి, వెంకట్, చంటి, సుజాత, గిరి, రమేష్, వీరస్వామి, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఏజెన్సీ దళితులకు అందని పథకాలు!

**దళితుల సమస్యలపై స్పందించని సీఎం**

**మండిపడిన బీఆర్ఎస్ నేత భరత్ చౌహాన్**

**భూములకు పట్టాలు లేక అవస్థలు**

**ఆదిలాబాద్, మే 16 (మనసులో మాట):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏజెన్సీ ప్రాంత దళితులను పూర్తిగా మోసం చేశారని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భరత్ చౌహాన్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మహదాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీలకు కనీస సదుపాయాలు, ప్రభుత్వ ఫలాలు అందడం లేదని, వారు దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేకపోవడంతో దళిత రైతులు 'రైతు భరోసా' పథకానికి దూరమవుతున్నారని భరత్ చౌహాన్ పేర్కొన్నారు. కనీసం సాగు భూములకు పహానీలు నిలిపివేయడంతో బ్యాంక్ రుణాలు కూడా పొందలేని దుస్థితి నెలకొందని వాపోయారు. గ్రామాల్లో రోడ్డు సౌకర్యం, తాగునీటి వసతి వంటి కనీస అవసరాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏజెన్సీ దళితుల గురించి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, బాలాజీ, రాజ్ కుమార్, అర్జున్, శుద్ధోధన్, నీలకంఠ్, రాందాస్, కైలాస్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికే ఆరోగ్య సేవలు!

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం
- ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
- సేవలను వినియోగించుకున్న విద్యార్థులు, ప్రజలు




ఎల్బీనగర్, మే 16 (మనసులో మాట): హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ల ఆధ్వర్యంలో, విజయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటాలిటీ సహకారంతో కళాశాల ఆవరణలో "మీ ఆరోగ్యం, మా ప్రాధాన్యత" అనే ఇతివృత్తంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ పి. సురేష్ బాబు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో విద్యార్థులు, సిబ్బంది, స్థానిక నివాసితులకు జనరల్ హెల్త్ చెక్-అప్, బ్లడ్ ప్రెజర్, షుగర్ టెస్ట్, హార్ట్ చెక్-అప్ వంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం ఆరోగ్య సంరక్షణ, జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక అవగాహన కల్పించింది. ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజ సేవకు కళాశాల కట్టుబడి ఉందని, ఇలాంటి శిబిరాలు స్థానిక ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత దగ్గర చేస్తాయని ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఇ. యాదగిరి రెడ్డి, డాక్టర్ ఎస్. శారదా దేవి శిబిర కార్యకలాపాలను సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ హాస్పిటల్ డాక్టర్ కె. మల్లేష్, వైద్య సిబ్బందితో పాటు కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి. ఇందిర, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి. మధు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. నరసింహ, లైబ్రేరియన్ డాక్టర్ ఏ. దుర్గాప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె. అనిత, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, సమీప ప్రాంతాల ప్రజలు పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. అంకితభావంతో సేవలు అందించిన ఆసుపత్రి బృందానికి, వాలంటీర్లకు ఎన్ఎస్ఎస్ యూనిట్లు కృతజ్ఞతలు తెలియజేశాయి.

# అమావాస్య అన్నదానం మహా పుణ్యకార్యం!

**మాధవనగర్‌లో ఘనంగా అన్నప్రసాద వితరణ**

**పితృదేవతల ఆశీస్సుల కోసమే కార్యక్రమం**

**హాజరైన కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్**




ఎల్బీనగర్, మే 16 (మనసులో మాట): అమావాస్య రోజున అన్నదానం చేయడం హిందూ సంప్రదాయంలో మహా పుణ్యకార్యంగా భావిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఎల్‌బీనగర్ పరిధిలోని మాధవ నగర్ కమిటీ హాల్ లో అమావాస్య సందర్భంగా బ్రహ్మదండి నాగేశ్వరరావు, మంజుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాధవ నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పితృదేవతలకు తర్పణాలు చేసి వారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత్, ఉయ్యాల యాదయ్య గౌడ్, ముగుతాల విజయ్ గౌడ్, దీపక్ ముదిరాజ్, బి. వంశీ, శ్రావణి, వరుణ్, శిరీష, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఉప్పల్ - వరంగల్ రూట్‌లో ఆంక్షలు!

**ఎలివేటెడ్ కారిడార్ పనుల వల్ల నిర్ణయం**

**వరంగల్ బస్టాప్ నల్లచెరువుకు తరలింపు**

**ఆదివారం నుంచి వాహనాల దారి మళ్లింపు**




హైదరాబాద్, మే 16 (మనసులో మాట): ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు కీలక ఆంక్షలు విధించారు. ఇందులో భాగంగా ఉప్పల్ సర్కిల్‌లోని వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు. ఉప్పల్ వద్ద వరంగల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. జీఎస్ఐ జంక్షన్ వద్ద బీరప్పగడ్డ మీదుగా ఎన్హెచ్-163 పైకి వాహనాలు వెళ్లాల్సి ఉంటుంది. అలాగే వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను మేఫిల్ హోటల్ వద్ద దారి మళ్లిస్తారు. ఈ వాహనాలు ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి, ఫ్లైఓవర్ వద్ద యూటర్న్ తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. వరంగల్ నుంచి వచ్చే పెద్ద వాహనాలను ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్‌కు మళ్లిస్తారు. వరంగల్‌కు వెళ్లే భారీ వాహనాలను హయత్‌నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘటకేసర్‌కు మళ్లించనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మార్పులను గమనించి వాహనదారులు సహకరించాలని కోరారు.

# ఓటర్ జాబితాలో ఖచ్చితత్వం ముఖ్యం!

**హయత్ నగర్ రెవిన్యూ ఆఫీసులో సమావేశం**

**ఓటర్ల సవరణపై అధికారుల సుదీర్ఘ చర్చ**

**హాజరైన మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి**



ఎల్బీనగర్, మే 16 (మనసులో మాట): రాష్ట్రంలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై హయత్ నగర్ మండల రెవిన్యూ కార్యాలయంలో ఎంఆర్ఓ జానకి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్ జాబితా అధికారులు పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న సవరణ కార్యక్రమం, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, పారదర్శకమైన ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై సమగ్రంగా చర్చించారు.

**పారదర్శకంగా విధులు నిర్వహించాలి**

ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటర్ జాబితా ఖచ్చితత్వం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన పౌరుడు తమ పేరు ఓటర్ జాబితాలో సరిచూసుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో జరగనున్న ఈ సవరణ కార్యక్రమం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా అమలు కావాలని, అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెంపొందించి ప్రతి ఒక్కరి ఓటు హక్కు రక్షించబడేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హయత్ నగర్ ప్రజల ప్రయోజనాల కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, తెలంగాణ రాష్ట్ర సమితి నాయకురాలు సింగిరెడ్డి మల్లేశ్వర్ రెడ్డి, కమ్యూనిస్టు పార్టీ మార్కిస్ట్ నాయకులు కీసర నర్సిరెడ్డి, గణేష్ గౌడ్, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపుపై సీపీఎం ఆగ్రహం!

**హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన**

**సామాన్యులపై భారం తగ్గించాలని డిమాండ్**

**కేంద్ర ప్రభుత్వ విధానాలపై రాఘవులు ధ్వజం**




హైదరాబాద్, మే 16 (మనసులో మాట): పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై నేరుగా భారం పడుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెంచిన ఇంధన ధరలను తక్షణమే తగ్గించాలంటూ కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

**అంతర్జాతీయ పరిణామాల సాకుతో దోపిడీ**

ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధాన్ని ఆపడానికి కేంద్రం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా యుద్ధాలు ఆగితే ఇక్కడ ధరలు పెంచాల్సిన అవసరమే ఉండదన్నారు. ప్రధాని మోదీ యుద్ధ నివారణకు తగిన చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహమై ట్రంప్‌నకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నారని విమర్శించారు. అక్కడ యుద్ధాన్ని సాకుగా చూపి ఇక్కడ ప్రజలపై భారాలు మోపడం విడ్డూరంగా ఉందన్నారు. మోదీ చెప్తున్న పొదుపు మంత్రంతో దేశం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. గ్యాస్, ఇంధన ధరల పెంపు వల్ల ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడ్డాయని రాఘవులు పేర్కొన్నారు. దీనివల్ల లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే దుర్భర పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో తప్పు చేసేవాడు ఒకడైతే, దానికి సామాన్య ప్రజలకు శిక్ష వేసేలా పాలన సాగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, బండారు రవికుమార్, సీనియర్ నేత డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.